# అహింసాత్మక ప్రతిఘటన విషయంలో మార్టిన్ లూథర్ కింగ్ చెప్పింది సత్యమని రుజువవుతోంది

## How the world is proving Martin Luther King right about nonviolence

**Erica Chenoweth and Maria J. Stephan**

Washington Post, January 18, 2016
Translation: March 2018

# అహింసాత్మక ప్రతిఘటన విషయంలో మార్టిన్ లూథర్ కింగ్ చెప్పింది సత్యమని రుజువవుతోంది

- *ఎరికా చెనోవెత్, మారియా జె. స్టిఫెన్*



*(ఎమన్ కార్యకర్త తవక్కల్ కార్మన్ (కుడిపక్కన, తెల్లని స్కార్ఫ్ ధరించిన మహిళ) మహిళా హక్కుల కోసం అహింసాత్మక పోరాటం నిర్వహించినందుకు గాను నోబుల్ ప్రైజ్ పొందారు. (పంపినవారు సుదర్శన్ రాఘవ్, ఫోటో ఎడిటర్)*

"అణగారిన వర్గాలకు స్వేచ్ఛల పోరాటంలో అందుబాటులో ఉన్న అత్యంత శక్తివంతమైన ఆయుధం అహింసాత్మక పోరాటమే అన్న బలమైన నమ్మకంతో నేను భారతదేశం వదిలాను." (ది ఆటో బయోగ్రఫీ ఆఫ్ మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్, సంపాదకులు క్లేబోర్న్ కార్సన్)

ప్రపంచం 2011 నుంచి తీవ్రమైన వివాదాలకు నిలయంగా మారిపోయింది. మధ్యప్రాచ్యంలో, సాహిల్ ప్రాంతంలో, దక్షిణాసియాలో సాయుధ విప్లవాలు తలెత్తినప్పటికీ ప్రజలు తమ

కష్టాల పరిష్కారానికి, పోరాటానికి ఎన్నుకునే ప్రాథమిక పోరాటవ్యూహం హింసాత్మక ఘర్షణ కానేకాదు. టునిషియా నుంచి తహ్రీర్ స్క్వేర్ వరకు జుకోటి పార్కు నుంచి ఫెర్గుసన్ వరకు, బుర్కినా ఫాసో నుంచి హాంకాంగ్ వరకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యమాలన్నీ గాంధీ, మార్టిన్ లూథర్ కింగ్ ల నుంచి పాఠాలు గ్రహించినవే. వివిధ ప్రాంతాల్లో కార్యకర్తలు ఈ పద్ధతులద్వారానే మార్పునకు ప్రయత్నిస్తున్నారు.

గాంధీ, మార్టిన్ లూథర్ కింగ్ ఇద్దరు అహింసాత్మక పోరాటాన్ని నొక్కి చెప్పారు. ఈ పద్ధతిలో నిరాయుధ ప్రజానీకం స్ట్రయికులు, ప్రతిఘటనలు, నిరసనలు, బహిష్కరణలు తదితర మార్గాల్లో ప్రత్యర్థిని ఎదుర్కుంటారు. అయితే ఈ పద్ధతిని విమర్శించినవాళ్ళు కూడా లేకపోలేదు. అసలు పౌర ప్రతిఘటన అంటే ఏమిటన్న విషయమై అపార్థాల వల్ల కొందరు విమర్శిస్తున్నారు. అత్యంత బలసంపద ఉన్న ప్రత్యర్థిని సవాలు చేయడానికి, సంఘటితంగా ఎదుర్కోడానికి నిరాయుధ, అణగారిని ప్రజల సామర్థ్యం పట్ల అనుమానంతో మరికొందరు విమర్శిస్తుంటారు. ప్రతి కొత్త ఉద్యమంలోను ఒకటే మాదిరి సవాళ్ళు ముందుకు వస్తుంటాయి. అందులో నిరాయుధ అహింసాత్మక ప్రతిఘటన శక్తి సామర్థ్యాల గురించి అనుమానాలు కూడా ఒకటి. ముఖ్యంగా అధికారబలం, వ్యవస్థీకృత అణిచివేతలను ఎదిరించడంలో అహింసాత్మక పోరాటం సామర్థ్యాన్ని అనుమానిస్తారు. మేము 2011లో ఒక పుస్తకం ప్రచురించాము. అందులో ఈ ప్రశ్నల గురించి చర్చించాము. హింసాత్మక ఉద్యమాల కన్నా అహింసాత్మక ఉద్యమాలు రెట్టింపు సంఖ్యలో విజయాలు సాధించాయన్నది గమనార్హమైన విషయం. అధికారంలో ఉన్న నియంతలను పదవి నుంచి దించడంలో అయినా గాని, ప్రాంతీయ స్వతంత్రం సాధించుకోవడంలో అయినా గాని అహింసాత్మక పోరాటాలు అధిక ప్రభావం వేశాయి.

చాలా మందికి ఈ మాటలు చాలా అమాయకంగా కనిపించవచ్చు. కాని మనం డాటాను, గణాంకాలను పరిశీలిస్తే, అహింసాత్మక పోరాటాలు ప్రత్యర్థి హృదయం కరిగేలా చేసి విజయం


సాధించినవేమీ కాదు. అవి విజయం సాధించడానికి కారణం అహింసాత్మక పోరాటాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనే అవకాశాలు ఉండడమే కారణం. సగటున చూస్తే, హింసాత్మక పోరాటాల కన్నా 11 రెట్లు ఎక్కువగా అహింసాత్మక పోరాటాలు ప్రజలను ఉద్యమంలోకి ఆకర్షిస్తున్నాయని తెలుస్తుంది. దీనివల్ల ప్రత్యర్థి శిబిరంలో అధికార సమతూకం దెబ్బతింటుంది. సమాజంలోని విభిన్న వర్గాల నుంచి లభించే మద్దతు వల్ల ఉద్యమం బలం పుంజుకుంటుంది. సంస్కరణలకు మార్గం వేస్తుంది. మద్దతుదారుల్లో అతివాదులను కట్టడిలో ఉంచుతుంది. ఇది అహింసాత్మకంగా కొనసాగడం వల్ల రాజ్యవ్యవస్థకు మద్దతిచ్చే కేంద్రాల్లో పునరాలోచనలు, మద్దతు ఉపసంహరణకు దారితీస్తుంది. భద్రతాదళాలు, ఆర్థికంగా ఉన్నతస్థాయి వర్గాలు, పౌర ఉన్నతోద్యోగులు రక్తపాతంతో కూడిన ప్రతీకార చర్యల భయం ఉండదు కాబట్టి రాజ్యవ్యవస్థను వ్యతిరేకిస్తూ ఉద్యమశిబిరానికి సానుభూతిపరులుగా మారే అవకాశాలుంటాయి.

మరోవిధంగా చెప్పాలంటే, అహింసాత్మక పోరాటాలు విజయం సాధించడానికి కారణం కేవలం పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనే అవకాశం ఉండడం మాత్రమే కాదు, ఇందులో ఉన్న సృజనాత్మక, సమన్వయాత్మక, ఒత్తిడి పెంచే సామర్థ్యం వల్ల ఇవి విజయాలు సాధిస్తాయి. అల్బర్ట్ ఐన్ స్టీన్ ఇనిస్టిట్యూషన్ వ్యవస్థాపకుడు జీన్ షార్ప్ అనేక దశాబ్దాలుగా చెబుతు వస్తున్న సిద్ధాంతమిది. సహజంగానే అహింసాత్మక పోరాటాలన్నీ విజయవంతం కాలేవు. అయితే అహింసాత్మక పోరాటాలు విఫలమైన సందర్భాల్లో హింసాత్మక పోరాటం వల్లనైనా ఫలితాలు లభిస్తాయని చెప్పే సాక్ష్యాధారాలేమీ లేవు.

ఇది 2011 నాటి మాట. ప్రస్తుతం మనం 2016లో ఉన్నాం. ఈ ఐదు సంవత్సరాల కాలంలో అహింసాత్మక పోరాటాల గురించి మనం నేర్చుకున్నదేమిటి? కొన్ని ముఖ్యమైన విషయాలను క్రింద పొందుపరిచాము. అహింసాత్మక పోరాటాల పట్ల అనుమానంతో చూసేవారిని ఆశ్చర్యానికి గురిచేసే అంశాలు కూడా ఇందులో కొన్ని ఉన్నాయి.

# 1 . అహింసాత్మక పోరాటాలు సర్వసాధారణమయ్యాయి


చరిత్రలో ఒక ప్రత్యేకమైన కల్లోలిత పరిస్థితిలో మనం జీవిస్తున్నామని మీరు భావిస్తుంటే, అది అబద్ధమేమీ కాదు. కాని ప్రస్తుత కాలానికి సంబంధించిన అస్థిరత్వం ఇది. ”ది మేజర్ ఎపిసోడ్ ఆఫ్ కంటెన్షన్ ప్రాజెక్ట్“ (ప్రొఫెసర్ ఎరికా చెనోవిత్ డెన్వర్ విశ్వవిద్యాలయంలో చేపట్టిన డాటా ప్రాజెక్టు) ప్రకారం అహింసాత్మక పోరాటాలనేవి ప్రపంచవ్యాప్తంగా అసమ్మతి ప్రదర్శనకు, సంఘర్షణలకు మోడల్ కేటగిరీగా మారిపోయాయి. మరో డాటా సేకరణ ప్రాజెక్టు, నావ్కో డాటా ప్రాజెక్టు, విభిన్నమైన సమాచార వనరులను, ఇంక్లూషన్ విధానాన్ని పాటించిన డాటా ప్రాజెక్టు కూడా ఇలాంటి ఫలితాలనే సూచిస్తోంది. అలాగే అనేక ఇతర డాటా ప్రాజెక్టుల్లోను ఇదే విషయం తెలియవస్తోంది. కాగా హింసాత్మక తిరుగుబాటులు, అంటే యుద్ధరంగంలో 1000 లేదా అంతకు మించిన సంఖ్యలో మరణాలున్న తిరుగుబాటులను లెక్కలోకి తీసుకుంటే, 1970 తర్వాతి నుంచి ఇలాంటి తిరుగుబాటులు తగ్గుముఖం పట్టాయి. అహింసాత్మక పోరాటాల సంఖ్య నానాటికి పెరుగుతోంది. గమనించవలసిన విషయమేమంటే ఈ అహింసాత్మక పోరాటాలన్నీ మాక్సిమలిస్ట్ పోరాటాలు. అంటే వాటి లక్ష్యం అధికారంలో ఉన్న వ్యవస్థను కూల్చడం. ప్రాంతీయ స్వతంత్రం సాధించడం, విదేశీ సైనికదళాలను పారదోలడం లేదా వలసవాద శక్తులను పారద్రోలడం.




ఈ దశాబ్దం మొదటి ఐదు సంవత్సరాల కాలంలో 1990 దశాబ్దం మొత్తం కన్న ఎక్కువగా అనేక కొత్త అహింసాత్మక పోరాటాలు రంగంలోకి రావడం మనం చూశాం. అలాగే 2000 దశాబ్దంలో ఎన్ని అహింసాత్మక పోరాటాలు జరిగాయో అంతే సంఖ్యలో ఈ ఐదు సంవత్సరాల కాలంలో కనబడతాయి. ప్రస్తుత దశాబ్దం చరిత్రలో అత్యంత ఘర్షణాత్మకమైన దశాబ్దంగా పేరుపడింది.

## 2 . అహింసాత్మక పోరాటాలు అధికమైనప్పటికీ విజయం సాధించే రేటు పడిపోతోంది

అహింసాత్మక పోరాటాలు పెద్ద సంఖ్యలో తలెత్తుతున్న కాలంలో విజయాల శాతం కూడా పడిపోతోంది. ఇంతకు ముందు 1990 దశకంలో అహింసాత్మక పోరాటాలు విజయవంతమైన శాతం అత్యధికంగా ఉంది. ప్రస్తుత దశాబ్దంలో ఈ శాతం చాలా పడిపోయింది.




దీని వెనుక కొన్ని కారణాలున్నాయి. మొదటి కారణం, ప్రత్యర్థులు కాలక్రమేణా కొత్తపాఠాలు నేర్చుకుని పరిస్థితులకు అనుగుణంగా మారుతున్నారు. ప్రజల్లో నుంచి వచ్చే సవాళ్ళను తట్టుకునేలా రూపొందుతున్నారు. కొన్ని దశాబ్దాల క్రితం వాళ్ళు ప్రజల శక్తిని తక్కువగా అంచనా వేసినప్పటికీ, తమ పరిపాలనకు ప్రమాదంగా మారతారని అప్పట్లో ఊహించనప్పటికీ, నేడు మాత్రం ప్రజా పోరాటాలు చాలా ప్రమాదకరమైనవని గుర్తించారు. అలాంటి పోరాటాలు తలెత్తకుండా శక్తియుక్తులన్నీ వినియోగిస్తున్నారు. బ్రూస్ బూనో డి మస్కిటా, అలాస్టయిర్ స్మిత్ రాసిన పుస్తకం ”ది డిక్టేటర్స్ హ్యాండ్ బుక్“ లోని ఎత్తుగడలు అనుసరిస్తున్నారో లేక తెలివిగా అణిచివేతను అమలు చేస్తున్నారో ప్రజాపోరాటాలు తలెత్తిన వెంటనే వాటిని పెరగకుండా అడ్డుకుంటున్నరు. ఈ కొత్త పరిస్థితి, అంటే అనుభవాల నుంచి పాఠాలను గ్రహించిన పరిస్థితి,  ఆదమ్ స్మిత్ కాలేజికి చెందిన కెచమ్ ఛైర్, స్టీవ్ హైడ్ మ్యాన్ దీన్ని ”అధారిటేరియనిజమ్ 2.0“ (నియంతృత్వం 2.0)గా పిలిచారు. అట్లాంటిక్ కౌన్సిల్ లో నియంతృత్వం భవిష్యత్తుకు సంబంధించిన ’ఫ్యూచర్ ఆఫ్ అధారిటేరియనిజం‘ ప్రాజెక్టులో ఇదే ముఖ్యమైన అంశం.

రెండవ కారణం, అహింసాత్మక పోరాటాలు చేస్తున్న కార్యకర్తలు ప్రపంచంలో సమకాలీన అహింసాత్మక పోరాటాల నుంచి బహుశా సరయిన పాఠాలు నేర్చుకోలేదు. ఉదాహరణకు 2010, 2011 సంవత్సరాలలో టునిషియాలో భారీ ప్రజా ప్రదర్శనలు చూసి కేవలం మూడు వారాల భారీ ప్రదర్శనలతో ఒక నియంతను దించేయొచ్చని ఎవరైనా భ్రమపడవచ్చు. కాని అలా అనుకోవడం వల్ల కొన్ని వాస్తవాలను మరిచిపోతుంటారు. టునిషియాలో ఇటీవలి కాలంలో అత్యంత బలమైన కార్మికోద్యమాలు నడిచాయి. ఈ కార్మిక కార్యకలాపాలు ప్రజాపోరాటానికి మద్దతిచ్చాయి. సమ్మెలు టునిషియా ఆర్థికవ్యవస్థ కుదేలయ్యే పరిస్థితి సృష్టించాయి. అందువల్ల ఆర్థికంగా ఉన్నతస్థాయి వర్గాలు, కులీన వర్గాలు దేశాధ్యక్షుడు జైనులాబ్దీన్ బిన్ అలీకి తమ మద్దతు వెనక్కు తీసుకున్నాయి. అలాగే భద్రతాదళాలు కూడా విధేయతను నిరాకరించాయి. అధ్యక్షుడి ఆదేశాలను తిరస్కరించాయి. ఆటోమేటిక్ ఆయుధాలతో ఆందోళనకారులపై దాడి చేయడానికి నిరాకరించాయి.

ఇలాంటి పరిస్థితుల నుంచి ప్రేరణ పొందడానికి కార్యకర్తలు ప్రయత్నించడం సహజమే. కాని అలాంటి సందర్భాల్లో వైఫల్యాలు కూడా ఎదురు కావచ్చు. టెక్సాస్ విశ్వవిద్యాలయానికి చెందిన కర్ట్ వేల్యాండ్ ప్రకారం 1848 కాలంలో ప్రపంచవ్యాప్తంగా హింసాత్మక తిరుగుబాటులు అధికంగా కొనసాగిన కాలంలో ఫ్రెంచ్ రాజరికంపై తిరుగుబాటు దారులు అనుసరించిన పోరాటవ్యూహాన్నే మిగిలిన పోరాటాలు కూడా అనుసరించే ప్రయత్నం చేశాయి. కాని విభిన్నమైన శక్తిసామర్థ్యాలున్న, సంసిద్ధంగా ఉన్న నియంతలు ఈ తిరుగుబాటులను అణిచివేశారు. ఆ తర్వాత నియంతలు విప్లవకారుల తదుపరి చర్యలను ముందుగానే పసిగట్టగలిగారు. తిరుగుబాటును అణిచివేయడమే కాదు, తిరుగుబాటులో చీలికలను తెచ్చి తమకు అనుకూలంగా మార్చుకోగలిగారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితే

మనకు మరోరూపంలో కనబడుతుంది. ముఖ్యంగా ప్రాంతీయ పోరాటాల తదుపరి దశలో ఇది కనబడుతోంది.

## 3 . అయినా హింసాత్మక పోరాటాల కన్నా అహింసాత్మక పోరాటాలే ఎక్కువగా విజయవంతం అవుతున్నాయి

హింసాత్మక పోరాటాలు చాలా దారుణంగా విఫలమవుతున్నాయి. విజయాలు సాధించిన శాతం పరిశీలిస్తే అహింసాత్మక పోరాటాల కన్నా చాలా వెనుకబడి ఉన్నాయి. ముఖ్యంగా 1960 తర్వాతి నుంచి ఈ పరిస్థితి మనకు కనబడుతుంది. మరోవిధంగా చెప్పాలంటే 1900 నుంచి 2015 మధ్యకాలంలో అహింసాత్మక పోరాటాలు 51 శాతం విజయవంతమయ్యాయి. హింసాత్మక పోరాటాలు కేవలం 27 శాతం విజయవంతమయ్యాయి. ఈ దశాబ్దంలో ఇంతవరకు 30 శాతం అహింసాత్మక పోరాటాలు విజయవంతమయ్యాయి. 12 శాతం హింసాత్మక పోరాటాలు విజయవంతమయ్యాయి. అంటే హింసాత్మక, అహింసాత్మక పోరాటాల విజయాల శాతం లో తేడా ఇప్పుడు మరింత ఎక్కువగా ఉంది.

## 4 . అహింసాత్మక ప్రజా పోరాటాల్లో హింసాత్మక సంఘటనలు నష్టదాయకం

ప్రాథమికంగా అహింసాత్మకమైన పోరాటంలో అప్పుడప్పుడు అవసరమైతే కొద్దిపాటి హింసాత్మక పంథా అనుసరించడం వల్ల లాభమా నష్టమా అన్న చర్చ 2011 నుంచి కొనసాగుతోంది. అమెరికాలో ఈ ప్రశ్న ఎత్తుగడల్లో వైవిధ్యంగా చర్చలోకి వస్తోంది. కాని అహింసాత్మక, హింసాత్మక, మిశ్రమ పద్ధతుల్లో పోరాటాలనేవి ప్రపంచవ్యాప్తంగా విప్లవాత్మక మార్పులు సాధించాలనుకునే పోరాటాల్లో సాధారణంగా కనిపిస్తూనే ఉంటాయి. అనేకమంది

నిపుణులు, మేధావులు, పరిశీలకులు ఈ విషయమై లాభనష్టాల గురించి ఎవరేవిధంగా చెప్పినా ఇటీవలి కాలం వరకు దీనికి సంబంధించిన విశ్వసనీయమైన డాటా ఏదీ లేదు.

ఇటీవల రట్గర్ విశ్వవిద్యాలయానికి చెందిన చెనోవిత్, కర్ట్ షాక్ రాసిన "మొబిలైజేషన్" వ్యాసంలో పరిమితస్థాయిలో హింసాత్మక ఎత్తుగడలకు సంబంధించిన తులనాత్మక గణాంకాలు పరిశీలించారు. హింసాత్మక ఎత్తుగడలు కొన్ని స్వల్పకాలిక ఫలితాలను సాధించినప్పటికీ, అంటే మీడియా దృష్టిని ఆకర్షించడం, ఆత్మరక్షణ అన్న అభిప్రాయాన్ని కలుగజేయడం, అతివాద శక్తుల నిబద్ధతను చూపిస్తూ వినిపించే అసమ్మతి గళాలను ఎదుర్కోడానికి, అవసరమైనప్పుడు ఆగ్రహాన్ని వెళ్ళగక్కే సామర్థ్య ప్రకటనకు ఇవి ఉపయోగపడతాయి. కాని హింసాత్మక ఎత్తుగడలు దీర్ఘకాలిక వ్యూహాత్మక లక్ష్యాలకు నష్టం కలిగిస్తాయి. ముఖ్యంగా విభిన్న వర్గాల నుంచి లభించే భారీ మద్దతు విషయంలోను, తటస్థ శక్తుల మద్దతు కూడగట్టుకోవడంలోను, భద్రతాదళాల్లో సానుభూతి సృష్టించడంలోను పెద్ద దెబ్బ తగులుతుంది. ఈ డాటా వల్ల తెలిసిన మరో వాస్తవమేమంటే, చాలా తక్కువగా ప్రజలు పాలుపంచుకుంటున్న పోరాటాల్లోను, ఏదో ఒక ప్రాంతానికి, జాతికి పరిమితమైన ప్రజలు పాల్గొంటున్న పోరాటాల్లోను హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీనివల్ల విభిన్న వర్గాలు పోరాటానికి దగ్గరకావు. అహింసాత్మక పోరాటపంథా అవలంబించడంలో లభించే ముఖ్యమైన ప్రయోజనం లభించకుండా పోతోంది. మరో అధ్యయనంలోను తెలిసిన విషయమేమంటే హింసాత్మక ఘటనల వల్ల రాజ్య హింస పెరుగుతుంది. ఫలితంగా ఉద్యమంలో ప్రజలే పాల్గొనే శాతం తగ్గిపోతుంది. ఆవిధంగా అహింసాత్మక పోరాటాలు విజయవంతం కావాలంటే హింసాత్మక ఎత్తుగడలు ఏమాత్రం ఉపయోగపడవు.

ప్రిన్స్ టన్ విశ్వవిద్యాలయానికి చెందిన ఉమర్ వాసో దీనికి సంబంధించి మరిన్ని ఆధారాలు అందజేస్తున్నారు. అహింసాత్మక పోరాటాలు, హింసాత్మక పోరాటాలు రెండింటి

రాజకీయ ప్రభావానికి సంబంధించి ఆయన ఏమంటున్నారంటే, 1960 కాలంలో అమెరికాలోని పట్టణాల్లో నల్లవారి ప్రతిఘటనకు సంబంధించిన డాటాను పరిశీలిస్తే, అహింసాత్మక పోరాటం ఎంత ఎక్కువగా ఉంటే అంత ఎక్కువగా పౌరహక్కులకు మద్దతు లభించింది. అమెరికాలో ప్రజలకు ముఖ్యమైన సమస్యగా దీన్ని పరిగణించడం ప్రారంభమయ్యింది. కాని హింసాత్మక పోరాటం ఎంతగా పెరిగితే అంతగా దాన్ని శాంతిభద్రతల సమస్యగా పరిగణించడం ప్రారంభమయ్యింది. హింసాత్మక సంఘటనలు పెరిగిన కాలం అంటే 1965 తర్వాత ప్రజాభిప్రాయం పౌరహక్కులకు మద్దతు ఇవ్వడం వైపు మొగ్గడం తగ్గిపోయింది. అందుకు బదులుగా పోలీసుల చర్యలకు మద్దతివ్వడం పెరిగింది. ఉద్యమం మద్దతు కూడగట్టుకోవడంలో కుచించుకుపోయిన తీరు కనబడుతుంది. ప్రజాభిప్రాయం అన్నది స్వల్పకాలిక ఫలితాలకే కాదు, దీర్ఘకాలిక ఫలితాలకు కూడా చాలా అవసరం. శాంతిభద్రతలకు మద్దతివ్వడం పెరగడం వల్లనే రిపబ్లికన్లకు ఓట్లు ఎక్కువగా లభించాయి. అంటే, వివిధ ప్రతిఘటన పద్ధతులు అమెరికాలో దీర్ఘకాలిక రాజకీయ ప్రభావాలను వేశాయి.

## 5 . అహింసాత్మక పోరాటాలను ముందుగా ఊహించడం సాధ్యం కాదు

సామాజిక ఉద్యమాలు లేదా ప్రజా ప్రతిఘటనలు ఎప్పుడు తలెత్తుతాయన్న విషయమై సోషియాలజీలో ఎప్పటి నుంచో చర్చ జరుగుతూనే ఉంది. మాక్సిమలిస్ట్ అహింసాత్మక పోరాటాలు విభిన్నమైనవి. రాజ్యాధికారానికి వ్యతిరేకంగా సమన్వయంతో, వివిధ పద్ధతులతో రాజ్యపీఠాన్ని జాతీయస్థాయిలో కుదిపేయడానికి ఉద్దేశించినవి. అహింసాత్మక పోరాటాలకు కారణాలపై జరిగిన అధ్యయనాలు అనేక పరిస్థితులను గుర్తించాయి. ఉదాహరణకు డెన్సిటీ ఆఫ్ ది మాన్యుఫాక్చరింగ్ సెక్టర్ (బుచర్ అండ్ స్వెన్సన్ 2014), ఎమోషన్స్ (పెర్ల్ మ్యాన్ 2013), జియోగ్రాఫిక్ ప్రాక్సిమిటి (గ్లెడిష్ అండ్ రివిరా 2015).

2015లో చెనోవిత్, జే ఉల్ఫ్‌ల్డర్ లు కలిసి అనేక సాధారణ సిద్ధాంతాలను ప్రతిపాదించారు. ఇవి ప్రజాపోరాటాలకు సంబంధించిన సిద్ధాంతాలు. అహింసాత్మక పోరాటాలు ఎక్కడ తలెత్తుతాయో ఆ ప్రాంతాన్ని ఖచ్చితంగా ఈ సిద్ధాంతాల్లో ఏవైనా గుర్తించగలవేమో తెలుసుకోడానికి ఈ సిద్ధాంతాలు ప్రతిపాదించారు. హింసాత్మక పోరాటాలు, తిరుగుబాటులు, విప్లవాలను ముందుగా ఊహించడం చాలా వరకు సాధ్యమే. కాని అహింసాత్మక పోరాటాలు ఎక్కడైనా, ఏ కారణం వల్లనైనా తలెత్తవచ్చు. అసలు అసమ్మతి అనేది లేనే లేని ప్రాంతాల్లో, అసమ్మతిని కూడగట్టడం అసాధ్యంగా నిపుణులు భావించే ప్రాంతాల్లో కూడా తలెత్తవచ్చు. ఏ కారణాలు వల్ల అహింసాత్మక పోరాటాలు తలెత్తుతాయన్నది చెప్పడం, వాటిని ముందుగా ఊహించడం అంత సులభమేమీ కాదు. చెనోవిత్, ఉల్ఫ్ండర్ల ప్రకారం చాలా అనూహ్యంగా వివిధ సందర్భాల్లో తలెత్తుతాయి. వాటిని డాటా సహాయంతో పరిస్థితిని విశ్లేషించి ముందుగా ఊహించడం సాధ్యం కాదు. వాటికి కారణాలను ఖచ్చితంగా చెప్పడమూ సాధ్యం కాదు. మరోవిధంగా చెప్పాలంటే అహింసాత్మక ప్రతిఘటనకు పూనుకునేవారు అడ్డంకులను సృజనాత్మక పద్ధతులతో అధిగమిస్తారు. అనూహ్యమైన రీతుల్లో వ్యవహరిస్తారు.

## 6 . అణిచివేత అన్ని రకాల తిరుగుబాటులను అణిచివేయాలని చూస్తుంది కాని అహింసాత్మక పోరాట పంథా ఎంచుకునేలా లేదా పోరాట ఫలితం తనకు అనుకూలంగా ఉండేలా చేయలేదు.

ప్రత్యర్థి మెతకగా వ్యవహరించినప్పుడు అహింసాత్మక పోరాటాలు తలెత్తి విజయాలు సాధించవచ్చని కొందరంటారు. కాని ప్రత్యర్థి తన మెతకవైఖరి వదిలేసినప్పుడు అహింసాత్మక పోరాటం నిష్ప్రయోజనకరమంటారు. ఈ విషయమై మేం రాసిన 2011

పుస్తకంలోను చర్చించాము. ఇటీవల అధ్యయనాలు కూడా ఈ ముఖ్యమైన ప్రశ్నకు సమాధానమిస్తున్నాయి.

క్రూరమైన అణిచివేత అహింసాత్మక పోరాటాలపై ప్రభావం వేస్తుందా అన్న విషయమై వెండీ పెర్ల్ మ్యాన్ మాట్లాడుతూ తాను పలస్తీనా జాతీయోద్యమం గురించి రాసిన అద్భుతమైన పుస్తకంలో చర్చించారు.  ఉద్యమం అహింసాత్మక పోరాటం నుంచి హింసాత్మకంగా మారడానికి కారణం కేవలం క్రూరమైన అణిచివేత ఒక్కటే అని చెప్పలేమన్నారు. ఆమె ప్రకారం, పలస్తీనా ఉద్యమం వివిధ హింసాత్మక దశల్లో అణిచివేత ఎంత క్రూరంగా ఉన్నదో, మొదటి ఇంతిఫాదా సమయంలోను అణిచివేత ఇంతే క్రూరంగా ఉండేది. ఆమె ప్రకారం, సమైక్యతలో వచ్చిన మార్పులు హింసాత్మక పోరాటంగా దారితీశాయి. ఉద్యమంలో సాముదాయిక దృష్టి, నాయకత్వం, స్పష్టమైన అంతర్గత నియమనిబంధనలు ఉన్నప్పుడు ఉద్యమం అహింసాత్మక ఉద్యమంగా కొనసాగగలిగింది. ఇస్రాయీల్ ప్రభుత్వం ఎంత క్రూరమైన అణిచివేతకు పాల్పడినా అది అహింసాత్మక ఉద్యమంగానే కొనసాగింది. పరిశోధకులు జోనాథన్ సుట్టన్, చార్లెస్ బుచర్, ఇస్సాక్ స్వెన్సన్ లు కూడా ఇలాంటి అభిప్రాయమే ప్రకటించారు. ఉద్యమ నిర్మాణం, సంఘటితత్వం అనేవి అణిచివేతను ఎదుర్కోవడంలో కీలకమైన అంశాలుగా భావించారు. ఈ విషయమై నిర్దిష్టమైన డాటాను ఉపయోగించి వాళ్ళు చెప్పిందేమిటంటే, రాజ్యం ఏకపక్షంగా హింసను ఉపయోగించి అణిచివేతకు పాల్పడినప్పుడు, నిరాయుధ ప్రతిఘటనకారులను ఊచకోత కోసినప్పుడు ప్రతిఘటన శక్తులు ఒక పెద్ద వ్యవస్థలో సమన్వయ ఉద్యమంగా కొనసాగితేనే విజయం సాధించగలరు. అయితే, కొన్ని పరిశోధనలు అహింసాత్మక ప్రతిఘటన ఫలితాల విషయంలో అనుమానాలను ప్రకటించింది. ముఖ్యంగా అత్యాధునిక అణికివేత వ్యవస్థలను ఎదిరించడంలో ఎంతవరకు సఫలమవుతుందన్న విషయమై అనుమానాలు వెలిబుచ్చింది. అందులోను జాతినిర్మూలన లాంటి లక్ష్యాలు, రాజకీయంగా

నిర్మూలించాలన్న లక్ష్యాలున్న వ్యవస్థలను ఎదిరించే విషయంలో ఈ అనుమానాలున్నాయి. ఈ విషయంలో 1975 నుంచి 1985 మధ్యకాలంలో వామపక్ష ప్రతిఘటనలను గుటెమాలా భద్రతాదళాలు ప్రణాళికాబద్ధంగా ధ్వంసం చేసిన తీరు కొన్ని వ్యవస్థలు ప్రదర్శించే అత్యాధునిక పద్ధతులకు సంబంధించి ఒక హెచ్చరికలాంటిది కూడా. మార్చి 2011 లో డేరా వద్ద సిరియా పాలకుడు బషారుల్ అసద్ అహింసాత్మక ప్రతిఘటనకారులను క్రూరంగా హతమార్చిన సంఘటన అహింసాత్మక పోరాటాలు ఎంతగా సఫలమవుతాయో ఎలా విఫలమవుతాయో అర్థం చేసుకునే ఒక బీభత్సభరితమైన ఉదాహరణ.

కాని ప్రజా ప్రతిఘటన తలెత్తినప్పుడు ఈ అణిచివేత వ్యవస్థలు తమ కోసం పనిచేసే వారి విధేయతను ఎంతకాలం కాపాడుకుంటాయన్నది కూడా చెప్పడం సాధ్యం కాదు. సిరియా మాదిరి అసాధ్యంగా కనబడే పరిస్థితిలో అయినా ఇది చెప్పలేం. లీ స్మితీ, లెస్టర్ కర్ట్ అండ్ కొలాబరేటర్స్ అధ్యయనంలో నిరాయుధ ప్రతిఘటనకారులపై వ్యవస్థ అణిచివేత చాలా సందర్భాల్లో బెడిసికొడుతుంది. నైతికమైన ఆగ్రహానికి కారణమవుతుంది. పెద్ద సంఖ్యలో ప్రజలు ఉద్యమంలోకి వచ్చేలా చేస్తుంది. తటస్థంగా ఉన్నవారు కూడా ఉద్యమం వైపు మొగ్గు చూపేలా చేస్తుంది. మరోవైపు భద్రతాదళాల్లోను సానుభూతిని సృష్టిస్తుంది. వారు ఫిరాయింపులకు పాల్పడేలా చేస్తుంది. నిజానికి క్రూరమైన అణిచివేతలే చాలా సందర్భాల్లో అహింసాత్మక పోరాటాలకు దారితీస్తాయి. అంతేకాని అహింసాత్మక పోరాటాన్ని అణిచివేయలేవు. ఎమ్మెట్ టిల్ హత్య దీనికి ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. అమెరికా పౌరహక్కుల ఉద్యమంలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనడానికి ఈ హత్య దారితీసింది.

మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ డే రాసిన ”లెటర్స్ ఫ్రమ్ ఏ బర్మింగ్ హామ్ జైల్“ నుంచి ఈ క్రింది పంక్తులు పాఠకులకు ఈ విషయమై మరింత అవగాహన కలుగడానికి ఉపయోగపడతాయి.

"మిత్రులారా, నిబద్ధతతో కూడిన న్యాయపోరాటం, అహింసాత్మక ప్రతిఘటన లేకుండా మనం పౌరహక్కుల ఉద్యమంలో ఒక్క ముందడుగు కూడా వేయలేదు. దురదృష్టమేమంటే, కులీనవర్గాలు తమ సౌకర్యాలను స్వచ్ఛందంగా వదిలివేయడం అన్నది జరగదు. వ్యక్తిగతంగా కొందరు నైతికతకు కట్టుబడి తమ అన్యాయభరితమైన పద్ధతిని మార్చుకోవచ్చు. కాని రీన్ హోల్డ్ నీబర్ మనకు చెప్పినట్లు, వ్యక్తుల కన్నా సముదాయాలు చాలా అనైతికంగా వ్యవహరిస్తాయి. నియంతలు స్వచ్ఛందంగా స్వేచ్ఛలను ఇవ్వలేదని మనం చాలా బాధాకరమైన అనుభవాల నుంచి నేర్చుకున్నాం. అణగారిన వర్గాలు తమ స్వేచ్ఛలను డిమాండ్ చేయవలసి ఉంటుంది." అని రాశాడాయన.

కింగ్ రాసిన మాటల్లో అహింసాత్మక పోరాటాలకు సంబంధించి నైతికమైన, ఆచరణీయమైన విషయాలున్నాయి. బర్మింగ్ హామ్ లెటర్స్ పై జోనాథన్ రీడర్స్ రాసిన పుస్తకం లో పేర్కొన్న మాదిరిగా కింగ్ రాతల్లోని ఈ ఆచరణీయ కోణాన్ని తక్కువగా చూడలేం.

అహింసాత్మక పోరాటాల గురించి నేర్చుకోవలసింది చాలా ఉంది. ఇది ఇప్పుడు సరికొత్త రాజకీయ సందర్భం. సామాజిక శాస్త్రాల్లో ఈ విషయమై పరిశోధన కూడా అదేస్థాయిలో పెరుగుతోంది. అణిచివేతను ఎదిరించాలని భావించే ప్రజలకు మరింత వ్యవస్థీకృత పరిశోధన వల్ల లాభం చేకూరుతుంది. వివిధ సందర్భాల్లో అహింసాత్మక ప్రతిఘటన ఎప్పుడు ఎలా చేపట్టాలన్నది అర్థమవుతుంది. నియంతృత్వ వైఖరి పెరగడం, రాజ్యవ్యవస్థలో బలహీనతలు, హింసాత్మక అతివాదం వంటి సవాళ్ళను ఎదుర్కుంటున్న విధానకర్తలు అహింసాత్మక పోరాటాలు ఎప్పుడు? ఎలా? సఫలమవుతాయన్న విషయమై ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఉంటుంది. అహింసాత్మక పోరాటాలకు ప్రభావవంతంగా మద్దతివ్వడమంటే ఏమిటో కూడా అర్థమవుతుంది.

ఈ దశాబ్దంలో గతంలో కన్నా ఎక్కువగా చాలా మంది అహింసాత్మక పోరాటాలనే కొనసాగిస్తున్నారు. దీనికి సంబంధించి ఒక స్పష్టమైన మార్గనిర్దేశనం కోసం మేధావులు, అహింసాత్మక ప్రతిఘటనను అవలంబించేవారు గాంధీజీ, మార్టిన్ లూథర్ కింగ్ లు చెప్పిన ఆచరణీయతను, సూత్రబద్ధతను అధ్యయనం చేస్తే మరిన్ని ప్రయోజనాలుంటాయి.

*(యూనివర్శిటీ ఆఫ్ డెన్వర్ లోని, జోసెఫ్ కోర్బెల్ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్ లో ఎరికా చెనోవిత్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. పొలిటికల్ వయోలెన్స్ ఎట్ ఏ గ్లాన్స్ బ్లాగును ఆమె కో హోస్ట్ చేస్తున్నారు. మంకీ కేజ్ లో అప్పుడప్పుడు బ్లాగర్ గా రాస్తుంటారు. మారియా జె. స్టీఫెన్ అమెరికాలోని యు.ఎస్.ఇనిస్టిట్యూట్ ఆఫ్ పీస్ లో సీనియర్ ఫెలో. అట్లాంటిక్ కౌన్సిల్ లో నాన్ రెసిడెంట్ సీనియర్ ఫెలో.)*